


శ్రీమతి పరిమళా సోమేశ్వర్

'శకూ! శకూ!' [illegible] వీధిలోనుంచే భార్యను పిలుస్తూ వచ్చి కుర్చీలో కూర్చున్నాడు రాజా. స్కూలు నుండి రాగానే బట్టలు మార్చుకుని, స్నానం చేస్తేగాని ఏపనీ ముట్టని భర్త ఆరోజు వస్తూనే అమాంతం కుర్చీలో కూలబడటం ఆశ్చర్యాన్ని కలిగించింది శకుంతలకు.

'ఏమిటండి? ఏమయింది? ఆ చేతి లోని కాగితాల కట్టయేమిటి?' అంటూ తడిచేతులను చీరకొంగుకు తుడుచుకుంటూ వంటింట్లోనుంచి ఇవతలకు వచ్చింది.

'ఇది వట్టి కాగితాల కట్టకాదే పిచ్చి మొద్దూ! ఉత్తరం!'

'ఉత్తరమా! అంతపెద్ద ఉత్తరం మీకెవరు వ్రాశారబ్బా!' బుగ్గను వేలేసుకుంటూ ఆశ్చర్యాన్ని ప్రకటించింది శకుంతల.

'నువ్వయితే కాదుగా!' నిరుత్సాహానికి హాస్యాన్ని జోడిస్తూ అన్నాడు రాజా.

'ఆఁ ఇప్పుడు మనకి ప్రేమలేఖలొక్కటే తక్కువైనయ్.' మూతి విరిచింది శకుంతల.

'నిజంచెప్పు శకూ. మన పెళ్ళయి ఐదు సంవత్సరాలు దాటింది. ఈ ఐదు సంవత్సరాల్లోనూ నువ్వు కనీసం పది, పన్నెండు సార్లయిన మీ పుట్టింటికి వెళ్ళిఉంటావు. అందులో ఒక్కసారైనా ప్రేమగా, అప్యాయతగా వో ఉత్తరం వ్రాశావా? ఎంతసేపు మీ అమ్మ వచ్చేటప్పుడు పులిహోర గోంగూర పెట్టిస్తానన్నదనీ, మీ చెల్లెలు పెద్దమనిషయిందనీ, మీ తమ్ముడు గోడదూకబోయి కాలు విరగ్గొట్టుకున్నాడనీ, మీ నాన్నగారు శ్లేష్మంతో బాధపడుతున్నారనీ...యిలాటి

కబుర్లు తప్ప మరొకటి వ్రాయవు కదా!'

'ఔను, నేను మీలా కవినా, రచయితనా! అర్థం పర్థంలేని విషయాలు వ్రాయటానికి, ఏదో సంసారపక్షం మనిషిని కాబట్టి యింటి విషయాలు వ్రాసేదాన్ని. ఐనా యిప్పుడా సంగతులన్నీ ఎందుకు? ఆ ఉత్తరం ఎక్కడనుంచి వచ్చిందో చెప్పక!' అంది శకుంతల.

వ్యవహారం ముదిరిపోతోందని గ్రహించి, రాజా 'అప్పుడే అంతకోపమైతే యెలా గోయ్? చెప్తాను రా!' అంటూ ఆమె పమిటకొంగు పట్టుకుని దగ్గరకు లాగేడు,

అతనలా చప్పున లొంగిపోవటంతో శకుంతల మనసు కొంచెం మెత్తపడ్డది. కాని పైకిమాత్రం 'ఆ వేషాలన్నీ ఎందుకిప్పుడు? అసలు సంగతేమిటో చెప్పండి' అంది బింకంగా — వోపక్క అతనికి దగ్గరగా జరుగుతూనే.

'ఈమధ్య నేను వ్రాసిన 'గులాబి ముళ్ళు' అనే నవలమీద ఇరవైపేజీల ఉత్తరం వ్రాసిందొక పాఠకురాలు, ఆవిడ మామూలు పాఠకురాలు కూడా కాదు. ఇంగ్లీష్ లిటరేచర్‌తో ఎమ్మే పాసై ప్రస్తుతం రెండేళ్ళుగా పిహెచ్‌డి చేస్తోంది. అలాటి ఆమె ఆ నవలను అంతగా మెచ్చుకుంటూ పర్సనల్‌గా ఉత్తరంకూడా వ్రాసిందంటే ఆమె ఎంతగా 'ఇంప్రెస్' అయిఉంటుందో ఊహించుకో!' అంటూ ఉత్తరాన్ని భార్యచేతి కందించేడు రాజా.

శకుంతల మాట్లాడకుండా అతని చేతిలోని ఉత్తరాన్ని తీసుకుని చదవసాగింది. ఆ నవలను ఎంతో నిశితంగా చదివి, అర్థం చేసుకుని, వివిధకోణాల లోనూ దానిని విమర్శిస్తూ వ్రాసిన ఆ ఉత్తరాన్ని ఒకటికి, రెండుసార్లు చదివింది శకుంతల నిజంగానే ఆ ఉత్తరం వ్రాసిన తీరు, అక్షరాల పొందిక అన్నీ అద్భుతంగా ఉన్నాయ్. నవలలోని కథా వస్తువు, భాష, శిల్పం, శైలి, నవల యొక్క ముగింపు .ఒకటేమిటి ప్రతి చిన్న విషయాన్ని గురించి ఎంతో చక్కగా విమర్శిస్తూ వ్రాసిందా పాఠకురాలు. ఆమె పేరు సునందట. ప్రస్తుతం హైద్రాబాదులో ఉంటున్నది.

భార్య చదవటం పూర్తయినాక 'ఎలా ఉంది ఉత్తరం?' అనడిగేడు రాజా.

శకుంతల చిరునవ్వు నవ్వుతూ 'చాలా బాగుంది' అన్నది.

'నిజంగా నేనైతే ఆశ్చర్యపోయేననుకో ఆవిడ ఉత్తరం చదివేక నానవలలో నేనే ఉద్దేశించని అందాలను చూడ గలిగేను. ఒకరకంగా చూస్తే ఉత్తమమైన కళను సృష్టించే కళాకారుడి కన్నా ఆ కళలోని అందాన్ని, ఔన్నత్యాన్ని గ్రహించగల విమర్శకుడే చాలా గొప్పవాడని పిస్తోంది నాకు' అన్నాడు రాజా.

'ఔను నుమండీ!'

'ఈ నవలను గురించి చాలామంది చాలారకాలుగా విమర్శించేరు. ఐతే ప్రతి ఒక్కరూ ఏదో ఒక విషయాన్నే తీసుకుని, ఒకే కోణంలో అర్థం చేసుకుని వ్రాసేరేతప్ప యీమెవలె నవలలోని ప్రతి అంశాన్ని వివిధకోణాల్లోనూ చూసి వ్రాసినవారు చాలా తక్కువ. ఇలాటి సద్విమర్శకులు నా పాఠకులలో నూటికొక్కరున్నా చాలు ... నాకు తగినంత ఉత్సాహం, ప్రోత్సాహం లభిస్తుంది.'

'మీరింక స్నానానికి లేవండి. ఇప్పటికే చాలా ఆలస్యమయింది. నేను కాఫీ కలుపుకొస్తాను.' అంటూ వంటయింట్లోకి నడచింది శకుంతల.

ఐదు నిమిషాల్లో కాఫీ కలిపి, టిఫినుతోసహా బయటకువచ్చిన శకుంతల యింకా అలాగే కూర్చుని ఉత్తరం చదువుతున్న భర్తను చూస్తూనే సహనాన్ని కోల్పోయింది.

'ఇదిగో మిమ్మల్నే! ఇంకా ఎన్ని గంటలు చదువుతారా ఉత్తరాన్ని?' అంటూ గట్టిగా పిలిచిందతనిని.

'ఆఁ. వచ్చే వచ్చే ..' ఆమె కంఠంలోని కాఠిన్యాన్ని గుర్తించని రాజా కుర్చీలో నుండి లేవకుండానే సమాధానమిచ్చేడు ఉత్తరంలోకే తదేకంగా చూస్తూ.

టిఫిను ప్లేటు, కాఫీ కప్పు విసురుగా టేబులుమీద పెట్టి, అతని చేతిలోని ఉత్తరాన్ని తీసుకుని ముక్కలు ముక్కలుగా చింపివేసింది శకుంతల.

తెల్లబోయి ఆమె వంక చూసేడు రాజా ఆమె కళ్ళల్లో నిప్పులు కురుస్తున్నాయ్.

ఆమె శరీరమంతా ఉద్రేకంతో వణికిపోతోంది.

'ఏమిటీ పిచ్చి పని శకుంతలా?' అన్నాడు రాజా.

'పిచ్చి పని నాదా, మీదా? మీరు ఆఫీసునుండి వచ్చినప్పటినుండి మీ వాలకం చూస్తున్నాను. ఆ ఉత్తరాన్ని పట్టుకుని కుర్చీకి అతుక్కుపోయి చదివిందే పదిసార్లు చదవటంలో మీ ఉద్దేశ్యం యేమిటి? దేనికైనా ఒక హద్దనేది ఉండాలి. ఆవిడ ఉత్తరం బ్రహ్మాండంగానే ఉండవచ్చు. ఆమె గొప్ప విమర్శకురాలే కావచ్చు. అంత మాత్రాన దాన్ని వందసార్లు చదవవలసిన అవసరమేం లేదు ఇంతకూ మీకు నచ్చింది ఆవిడ విమర్శ కాదు ఆ—వి—డ. ఆ సంగతి నాకు తెలియదనుకుంటున్నారా? నేనంత పిచ్చిమొద్దునా? నన్ను మోసం చెయ్యాలనుకుంటున్నారేమో మీరు...'

'అబ్బబ్బ! ఏమిటామాటలు శకుంతలా! నిన్ను మోసం చెయ్యటమేమిటి? ముక్కూ మొహం ఎరగని ఆవిడంటే నాకిష్టమనటమేమిటి?'

'అబ్బో! మీ సంగనాచి కబుర్లు యింక నాకు చెప్పకండి ఐదేళ్ళుగా మీతో కాపురంచేస్తున్నాను. మీ బుద్ధులు నాకు తెలియవనా? ఇంతవరకు మీ రచనలనుగురించి పొగుడుతూ ఎన్ని ఉత్తరాలు రాలేదు? అవన్నీ నేను చదవలేదా? వాటన్నిటినీ మీరింత శ్రద్ధగా చదివేవాళ్ళా? కూడూ నీళ్ళూకూడా మాని అదేపనిగా 'ఆవిడ'ను గురించి ఆలోచించటంలో మీ ఉద్దేశ్యమేమిటో గ్రహించలేనంత పిచ్చిదాన్నా నేను? ఆవిడ కన్నెపిల్ల. ఎమ్మే ప్యాసయింది మేధావురాలూను మీ పెళ్ళామేమో ఫిప్పుఫారం తప్పి అంట్లగిన్నెలు తోముకునే మామూలు ఆడది. అలాటప్పుడు ఆమెనుగురించి కలలు కనటంలో మీవంటి కవులకు తప్పేమీ కనపడక పోవచ్చు. కాని మీలా కల్లిబొల్లి కబుర్లు రాయటం చేతకానంతమాత్రాన నేనొట్టి మూర్ఖురాలిననుకోకండి. నేనూ మనిషినే. అందునా మనసున్నా ఆడదాన్ని .....'

అని వెక్కివెక్కి ఏడుస్తూ అక్కడనుండి వెళ్ళిపోయింది శకుంతల

రాజా గాభరాగా లేచాడు కుర్చీలోనుండి

'శకున్తా విరహంతో ఏడున్తావా' అంటూ ఆమె వెనకనే నడచేడు.

చివ్వున వెనక్కి తిరిగింది. శకుంతల 'నాదగ్గరకు రాకండి. ఈ సమయంలో మీతో మాట్లాడాలంటేనే నాకు అసహ్యంగా ఉంది.'

అంటూ గదిలోకివెళ్ళి భళ్ళున తలుపు గడియవేసింది.

రాజా నాలుగైదుసార్లు తలుపుతట్టి పిలిచేడు భార్యను. ఆమె సమాధానం యివ్వలేదు సరికదా యింకా బిగ్గరగా ఏడవసాగింది.

ఇక చేసేదేం లేక తిరిగి వచ్చాడు రాజా.

ఆరోజు రాత్రి వంట చెయ్యనేలేదు శకుంతల. సాయంత్రం చేసిన టిఫిను, కాఫీ కూడా చప్పగా చల్లారిపోయినయ్— రాజుకు ఆకలి వెయ్యటం, ఆకలి చచ్చిపోయి నీరసం కూడా రావటం అయింది. ఈజీచైర్‌లో పడుకుని మగతగా నిద్రపోయేడు.

రాత్రి పదిగంటలవేళ తలుపులు తెరుచుకుని బయటకు వచ్చింది శకుంతల. నీరసంగా పడుకుని ఉన్న భర్తను చూస్తూనే ఆమెకు జాలివేసింది. తను సాయంత్రం టేబులుమీద పెట్టిన టిఫిను, కాఫీ అలాగే ఉన్నాయ్.

రాజా స్వభావం శకుంతలకు తెలుసు.

# కవిపత్ని

చాలామంది మగవాళ్ళలా అతను భార్య కోపం వచ్చినపుడు తనకు తానుగా కడుపు నింపుకుని తనదారిన తాను పోయేరకం కాదు. తమ యిద్దరి మధ్యా ఎంత పోట్లాట వచ్చినా శకుంతలవచ్చి ప్రతి మారీ తినిపిస్తేకాని తినడు, తను యింత వరకు రాకపోయేసరికి మారు మాట్లాడకుండా నిద్రపోతున్నాడు, ఆ విషయం గ్రహించేసరికి ఆమెలోని స్త్రీ హృదయం ద్రవించిపోయింది. తనే మూర్ఖంగా ప్రవర్తించిందేమోనన్నపశ్చాత్తాపభావం కూడా కలిగింది. కాని వెన్వెంటనే సునందకు అంత ప్రాముఖ్యతనిస్తూ అతను అదే పనిగా ఆమెను గురించి ఆలోచించేడన్న భావం కూడా వో పక్క ముల్లులా ఆమె మనసుకు గుచ్చుకుంటూనే ఉంది.

ఏది యేమైనా అసూయకంటె ఎక్కువగా ఆప్యాయతే ఆ సమయంలో ఆమె హృదయాన్ని ఆవరించి ఉండటంవల్ల గబగబ అన్నం, కూర స్టౌమీద పెట్టి వచ్చి భర్తను నిద్రలేపింది శకుంతల. నిద్రనుండి మేల్కొని కళ్ళు తెరిచేడు రాజా. ఐతే శకుంతలతో మాట్లాడదల్చుకోలేదతను. వెంటనే ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

భర్త కోపం చూస్తే ముచ్చటేసింది శకుంతలకు. వోపక్క తనెంత బాధపడ్డా, తన ప్రవర్తనవల్ల అతనిని కూడా బాధపెట్టేనన్న భావం ఆమె మనసును కరగించింది.

వంగి, రెండు చేతులలోకి భర్త ముఖాన్ని తీసుకుని 'నామీ దింకాకోపం తగ్గలేదా?' అనడిగింది గోముగా.

రాజా మాట్లాడలేదు. బింకంగా కూర్చున్నాడు,

అతని మెడకింద చక్కిలిగింత పెట్టి నవ్వించింది.

'ఇప్పుడు చెప్పండి. నామీద కోపం పోయిందోలేదో' అన్నది.

'కోపం వచ్చింది నాకా, నీకా?' అన్నాడు నిష్ఠురంగా.

'నిజంగానే అప్పుడు మీమీద నాకు చాలాకోపం వచ్చింది. ఏ స్త్రీ ఐనా తన భర్త మరొక స్త్రీని గూర్చి గొప్పగా భావించటాన్ని సహించలేదు. గొప్పకవులు, రచయితలు—మీరు—ఆమాత్రం నామనసు వర్ణం చేసుకోలేరా?' అంటూ అతని గుండెలో తలదాచుకుంది శకుంతల.

రాజా సానుభూతిగా ఆమె వీపు నిమిరేడు.

పదిరోజుల తరువాత.

ఆదివారంనాడు భోజనంచేసేక తీరికగా ఓ గేయం వ్రాయటం మొదలెట్టేడు రాజు, రాజా హైస్కూల్లో తెలుగు టీచర్లుగా పనిచేస్తున్నాడు. సాధారణంగా ప్రతి ఆదివారం కాంపోజిషన్ పుస్తకాలు దిద్దటమో, లేక ప్రతినెలా విద్యార్థులకు పెట్టే క్లాసుపరీక్షల పేపర్లు దిద్దటమో చేస్తుంటాడు. ఆరోజు పనేమీ లేక పోవటంవల్ల గేయం వ్రాయటానికి కూర్చున్నాడు.

అది పూర్తయేసరికి గంట పట్టింది.


అప్పటికి వంటింటి పని పూర్తిచేసుకుని వచ్చింది శకుంతల.

భార్యను చూస్తూనే విప్పారినముఖంతో 'రారా! నేను వ్రాసిన గేయం వినిపిస్తాను' అన్నాడు.

శకుంతల నవ్వుతూ వచ్చి అతని పక్కనే కూర్చుంది. రాజా చదవటం మొదలెట్టేడు.

అదో పల్లెపడుచుమీద వ్రాసిన ప్రేమ

మీ చొక్కాగుడ్డ తడిపి కుట్టమన్నార కదండి - తడిపాను - జేబురుమాలయింది!



# కవిపత్ని

గీతం, కళ్ళకు కాటుక, కాళ్ళకు కడియాలు, మెడలో కంటె, కాసులపేరు, నడుముకు వడ్డాణం వగైరా అలంకారాలను తగిలించుకుని, ఉరకలువేసే యౌవనంతో, చురుకుమనిపించే వాల్చూపులతో కవిగారి మనసులో గందరగోళాన్ని కలిగించిన ఆ రైతుకన్యయొక్క వర్ణనతో సాగిందా గీతం. అతను చదువుతున్నంతసేపూ శకుంతలకు వంటికి కారం పూసుకున్నట్టుగా ఉంది.

తన భర్త ఎంత రచయితైనాగానీ, ఒక స్త్రీనిగూర్చి అంగాంగ వర్ణనలు చేస్తూ ఆమెతో మానసిక వ్యభిచారం చెయ్యటం ఏమాత్రం సహించలేకపోయింది ఆమెలోని స్త్రీహృదయం.

ఐతే తన సృష్టిలో తానే తాదాత్మ్యం చెందుతూ, ఒక అపూర్వమైన ఆనంద భావంతో నిండిపోయిన ఆ కవికి భార్య ముఖంలో జరుగుతున్న రంగుల మార్పునుగాని, రేఖల సంచలనాన్నిగాని గమనించే అవకాశం లేకపోయింది.

ఒకటికి రెండుసార్లు ఆ భావగీతాన్ని రాగయుక్తంగా చదివి, అప్పుడు తలెత్తి భార్యవంక చూసేడు. 'ఎలా ఉంది? అద్భుతంగాలేదూ? అంటూ' ప్రశ్న, సమాధానం రెండూ తనేవేసేడు.

భర్త ఆనందాన్ని చూసేసరికి శకుంతలలోని ఈర్ష్యాగ్ని మరింత ప్రజ్వరిల్లింది. 'ఔను. అద్భుతంగా ఉండకేంచేస్తుంది? పరాయి ఆడదాన్ని చూసి లొట్టలేసుకుంటూ వ్రాసిన కవిత్వం అద్భుతంగా ఉండదు మరి?' అంటూ చివ్వున లేచింది' శకుంతల.

'హరహరా! ఏం మాటలే అవి?' చెవులు మూసుకున్నాడు రాజు.

'ఆ దొంగనాటకాలే ఆడొద్దు అంటున్నాను. ఒక మగవాడు ఎంత చెడ్డవాడైనా కానీ, తన చెడ్డతనాన్ని నిజాయితీగా, నిర్మొహమాటంగా ఒప్పుకుంటే సంతోషిస్తాను నేను. అంతే కానీ పైకి ప్రవరాఖ్యుడిలా ముఖంపెట్టి లోలోపల కుళ్ళుభావాలతో మగ్గిపోయే మగవాళ్ళంటే నాకు చచ్చే అసహ్యం. నిజం చెప్పండి. మన పనిమనిషి కూతురు రత్తాలు మొన్న మనింటికి వచ్చినపుడు దాన్ని చూసేకనేకదూ అలాటి పద్యం వ్రాయలని మీకు బుద్ధి పుట్టింది? ఏం మాట్లాడరే? అలా గుడ్లు మిటకరిస్తారేం? మీ రహస్యం నాకెలా తెలిసిపోయిందనా? ఆడదానికి పెళ్ళెప్పుడవుతుందో అప్పుడే మొగుడి మనసులోని రహస్యాలను చదివే విద్యకూడా అబ్బుతుంది.'

'ఎవరే ఆరత్తాలు? నేను దాన్నిసరిగ్గా చూడనన్నాలేదు.'

'హో పక్క ఎవరా రత్తాలు అని యేం తెలియనట్లు అంటూనే మళ్ళా 'సరిగ్గా' చూశ్లేదంటున్నారూ? అబద్ధమాడినా అతికినట్లుండాలి. కొత్తగా పెళ్ళయి అత్తవారింటినుండివస్తూ వంటెడు నగలు పెట్టుకుని అది మనింటికివస్తే మీరు కిటికీదగ్గర నిలబడి అదేపనిగాచూస్తుంటే నేను చూశ్లేదనుకున్నారా? కాస్త అది ఎర్రగా బుర్రగా ఉండేసరికి మీ కళ్ళకి మైకం క్రమ్మిందేం. అదేమంటే మీరు కవులు, భావుకులు, అంటూ ఉపన్యాసాలిస్తారు కాబోలు. పనిపిల్లల్లో కూడా అందాన్ని చూడగల రసికత్వం మీవంటి దౌర్భాగ్యులకే చెల్లింది. ఇంతకీ యిదంతా నాఖర్మ! మీరు కవులని తెలిసి పెళ్ళాట్టంలో బుద్ధితక్కువ నాది. తెలిసీ తెలియని ఆ చిన్నతనంలో కవులంటే ఎంతో గౌరవం, అభిమానం ఉండేది నాకు. అంతే కాని కనిపించిన ఆడదాన్నలా కోరుకునే నికృష్టులని తెలిస్తే యిలా పెళ్ళికి ఒప్పుకునేదాన్నేకాదు' అని ఉక్రోషం పట్టలేక ఏడుస్తూ అక్కడనుండి వెళ్ళిపోయింది శకుంతల.

రాజు తల చేత్తోపట్టుకుని కూర్చుండిపోయేడు. అప్పటినుండి తన గేయాల్లోగాని, కథల్లో కాని ఆడవాళ్ల అందాన్ని గూర్చిన వర్ణనలు వ్రాయాలంటే బెరుకుగా ఉండేది రాజుకి. సాధ్యమైనంతవరకు ప్రకృతి వర్ణనలు మాత్రమే చేస్తూ తద్వారా తనలోని సౌందర్యపిపాసను చల్లార్చుకునే వాడు ఆ మానవుడు.

ఐతే. రాజు దురదృష్టమేమో కానీ అప్పటికే అతనికి యింట్లో మనశ్శాంతి పూర్తిగా లభించటం మానివేసింది.

రాజు పనిచేస్తున్న స్కూల్లోని పిల్లలు తరచు యింటికి వచ్చి అతని దగ్గర తెలియని పాఠాలు చెప్పించుకుంటూ ఉండేవారు. అందులో ఆడపిల్లలు కూడా ఉండేవారు.

తొలి యౌవనంలో ఉన్న ఆ విద్యార్థినులను చూసినపుడల్లా శకుంతలకు కంటగింపుగా ఉండేది. సృష్టిలోని ప్రతి వస్తువులోను, ప్రతి జీవిలోను సౌందర్యాన్ని చూడటం, దానిని ఆరాధించటం కవుల ముఖ్య లక్షణాల్లో ఒకటని ఆమె గట్టి నమ్మకం. అందుకే ఆ ఆడపిల్లలతో అతి సన్నిహితంగా మెలగుతున్న తన భర్తను చూసినపుడల్లా ఆమె గుండె భగభగ మండుతూండేది.

తన మనసులోని ఈర్ష్యను సూటి మాటలతో భర్తకు వెల్లడి చేసేది కూడాను.

ఇది చాలదన్నట్లు రాజుకు మరో పెద్ద సమస్య ఎదురయింది. మర్యాద కోసం సునంద ఉత్తరానికి జవాబు వ్రాసేడు రాజు. తిరుగు పోస్టులోనే మరో ఉత్తరం వ్రాసింది సునంద. మళ్ళీ మర్యాద కోసం అతను వ్రాయటం, దానికి సునంద సమాధానం యివ్వటం వరుసగా జరగసాగినయ్. ప్రతి ఉత్తరంలోనూ సునంద అతనిని మహా రచయితగా వర్ణిస్తూ ఆకాశాని కెత్తివేస్తూండేది.

ఇతర కళలలానే సాహిత్యం కూడా వ్యాపార సరళిలోకి మారిపోయి దాని ప్రయోజనమే రూపుమాసి పోతున్న యీ తరుణంలో రాజులాంటి అభ్యుదయ కవుల అవసరం మన సమాజానికి ఎంతో ఉందని అంటూ అతను తన కలాన్ని సమాజ శ్రేయస్సు కోసం, చైతన్యం కోసమే అంకితం చెయ్యాలని కోరుతూ ఉత్తరాలు వ్రాస్తూండేది సునంద ఆమె ఉత్తరం చదివిన వెంటనే ప్రతి సారీ రాజులో ఒక నూతనోత్తేజం ప్రవేశించినట్టు, కర్తవ్య ప్రబోధం జరిగినట్లు అనుభూతి చెందుతూండేవాడు. కాని తన యీ భావాలను పొరపాటున కూడా భార్యకు వెల్లడి చేసేవాడు కాదు.

ఇకపోతే శకుంతల కూడా సునంద నుండి వచ్చే ఉత్తరాలను, వాటికి తన భర్త యిచ్చే సమాధానాలను అన్నిటినీ క్షుణ్ణంగా చదువుతుండేది. ఓ పక్క వాళ్ళిద్దరి స్నేహం అలా ఉత్తర ప్రత్యు

త్తరాల ద్వారా పొడిగింపబడటం యిష్టం లేక పోయినా, తన అసమ్మతిని బహిరంగంగా తెలపటం అసభ్యంగా, అసహ్యకరంగా ఉంటుందని గ్రహించి పైకి మాత్రం మామూలుగా ప్రవర్తించ సాగింది. పైగా ఒక్కో సమయంలో సునంద వ్రాసే ఉత్తరాల యెడల తన కెంతో ఆసక్తి ఉన్నట్లు కూడా నటించేది.

ఐతే ఉన్నట్టుండి బాంబు ప్రేలినట్లు ఓ వార్త తెలిసింది శకుంతలకు. సునంద కొద్ది రోజులలో రాజును చూట్టానికి తమ యింటికి రాబోతోందిట!

ఎంత అభిమానముంటే మాత్రం ఎంతగా అతని రచనల మీద గౌరవం ఉంటే మాత్రం స్వయం మనిషిని చూడాలని ఆత్ర పడటంలో ఆవిడ ఉద్దేశ్యమేమిటి? లోకంలో ఎంతమంది కవులు, రచయితలు లేరు? ఈవిడకు తన భర్తే నచ్చాలా? ఊరికే నచ్చటం కాక పైగా గాఢ స్నేహం కూడా చేసుకోవాలా? ఓ పెళ్లికాని పిల్లకి అలా పరాయి మగాడి మీద అంత చనువు ఏర్పడటంలో అర్థమేమిటి? అమ్మో! ఈ చదువుకున్న ఆడపిల్లల తంతు నేనెరగనా! కొంపలు తీసే రకం కదూ వీళ్లు...అలా సాగిపోతున్నయ్ ఆమె ఆలోచనలు.

ఏది యేమైనా, శకుంతల మనసులో ఎంతగా మథనపడ్డా సునంద రానే వచ్చింది.

గుమ్మంలో అడుగు పెట్టిన మెరుపు తీగలాటి సునందను చూస్తూనే కళ్లు చెదిరిపోయినయ్ శకుంతలకు

వస్తూనే కలకల నవ్వుతూ శకుంతలతో కలుపుగోలుగా మాట్లాడసాగింది సునంద. ఎంతసేపు చూసినా విసుగు పుట్టించని సునంద రూపం, ఎంత మాట్లాడినా ఆలసట కలిగించని ఆమె మాట తీరు యివన్నీ చూసేక. శకుంతల మనసులోని దిగులు మరింత ఎక్కువయింది.

'వదినగారూ! వదినగారూ!' అంటూ ఆమె ఎంతగా దగ్గరకు వచ్చినా శకుంతల హృదయంలోని అనుమానం అసూయ మరింత రాజుకున్నవే తప్ప తగ్గలేదు.

ఆమె అక్కడున్న నాలుగు రోజులూ రాజును స్కూలుకి వెళ్లనీయలేదు సునంద. 'నా కోసం మీరు తప్పకుండా సెలవు పెట్టాలి అన్నయ్యా!' అంది రాజుతో.

మొదటి రెండురోజులు సెలవు పెట్టినా శకుంతల ముఖంలోని భావాలను బట్టి ఆమె మనసును అర్థం చేసుకోగలిగిన రాజు హడలిపోయి, ఏదోఒక సాకుచెప్పి స్కూలుకి వెళ్లేడు మిగతా రెండు రోజులూను.

ఇక ఆ ఉన్న నాల్రోజులూ సునంద అనేక విషయాలనుగురించి రాజుతో చర్చించటం మొదలెట్టింది. కొంత తెలుగులోను, కొంత యింగ్లీషులోనూ గంటల తరబడి చర్చించుకుంటూ కూర్చునే వాళ్లిద్దరినీ చూస్తుంటే శకుంతలకు వాళ్లకు తన అయిష్టాన్ని ఎలా తెలియబరచాలో అర్థమయ్యేదికాదు.

సినిమాకు వెళ్లినా, షికారుకువెళ్లినా, యింట్లోఉన్నా, ఏం చేస్తున్నా ఏదోఒక విషయాన్నెత్తుకుని వాదనలోకి దిగేది సునంద. రాజుకూడా తరచుగా శకుంతల ఉనికిని మర్చిపోయి ఉత్సాహంగా మాట్లాడుతుండేవాడు ఎప్పుడో హఠాత్తుగా జ్ఞాపకంవచ్చి, భార్య ముఖంలోని భావాలను చూసేడంటే సరి — వెంటనే బిక్క చచ్చిపోయేవాడు.


ఐతే సునందకివేమీ తెలిసేవికావు. ఎంతసేపూ తన ధోరణిలో తనుండేదే తప్ప తన ప్రవర్తనవల్ల యితరులెలా ఫీలవుతారో ఆలోచించేదికాదు. హైద్రాబాదునుండి వచ్చేటప్పుడు సునంద శకుంతలకోసం పట్టుచీర ఒక బొట్టుగుడ్డ, రెండు, మూడు అలంకార వస్తువులు కొనుక్కొచ్చింది. శకుంతల సామాన్య గృహిణిఅనీ, అలాంటి చిన్న చిన్న కానుకలవల్ల ఆమెను పూర్తిగా సంతృప్తిపరచవచ్చునని సునంద ఉద్దేశ్యం. అంతే తప్ప ఆమె హృదయంలో తనవంటి చదువు, సంస్కారం, అందం, ఆకర్షణ గల ఒక యువతి ఎలాటి సంచలనాన్ని కలిగించగలదో ఊహించలేక పోయింది.

సునంద వెళ్లేరోజున శకుంతల, రాజుల మనసులలో ఒక చిత్రమైన నిర్లిప్తభావం గూడు కట్టుకోసాగింది. భయం, సంకోచం, బాధ, కోపం తారాస్థాయిని చేరుకోగా హఠాత్తుగా గడ్డకట్టుకు పోయిన నిర్లిప్తభావం రాజుది. అసూయ, దుఃఖం, నిరాశ, నిస్పృహ యుతశృతి మించిపోగా విరిగిన మనసులో ఏర్పడిన శూన్యత శకుంతలది.

సునంద వెళ్లిపోయింది.

స్టేషనువరకు ఆమెను సాగనంపి యింటికి వచ్చేసు రాజు, శకుంతలను కూడా రమ్మన్నది సునంద. ఆమె రాననేసరికి, ఆమెనుండి అలాటి సమాధానం రావటం అతి సహజమని భావించిన సునంద మళ్లీ బలవంత పెట్టలేదు

రాజు యింటికివచ్చేసరికి సాయంత్రం



**వాయిదాల చెల్లింపుపై ట్రాన్సిస్టర్**



నెలకు రు. 10/- వంతున వాయిదాలపై చెల్లించి ప్రపంచ ఖ్యాతి గల నేషనల్-70 3 బ్యాండ్స్, ఆల్‌వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ గ్యారంటీతో పొందండి ప్రతి గ్రామము పట్టణమునకు పంపబడును. వ్రాయండి.

MUSIC & SOUND (ASVPM-10)
P. B 1576, Delhi-6.



**దీర్ఘ రోగులకు ఉత్తమ వైద్యము**

నపుంసకత్వము, శుక్ల నష్టము, హస్తప్రయోగము, అనంతృప్తి, ఉబ్బసము, దమ్ము, బోదకాళ్లు, చెవుడు, కడుపునొప్పి, కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టులుద్వారా కూడా వైద్యము చేయబడును.

**శ్రీ బాలాజీ వైద్యశాల,**
డా॥ పి. కుమారస్వామి దేవర,
ట్రావెలర్స్ బంగళా రోడ్, తెనాలి.







**లిచెన్‌సా**
వాడండి
DZ1613ATG

# కవిపత్ని

ఆరుగంటలు దాటుతోంది. అప్పుడే చీకటి పడింది.

తమ యింట్లో దీపమైతే లేదు. దగ్గరగా వేసిఉన్న వీధి తలుపులను తోసుకుని లోపలికి వెళ్లేడు రాజా.

శకుంతల గదిలో మంచంమీద పడుకుని ఉంది.

రాజా స్విచ్చి నొక్కేడు. లైటు వెలిగింది.

ఆ వెలుగులో అశ్రుసిక్తమై ఉన్న ఆమె ముఖాన్ని స్పష్టంగా చూడగలిగేడు రాజా.

ఆమె నెలా పలకరించాలో అర్థం కాలే దతనికి.

అతను వచ్చిన సంగతి తెలిసికూడా నిర్వికారంగా, నిశ్చలంగా పడుకునిఉంది శకుంతల.

రాజువెళ్లి ఆమె పక్కనే మంచంమీద కూర్చున్నాడు. ఆమె ముఖం పక్కకు తిప్పుకుంది. ఆమె కళ్లవెంబడి నీళ్లు కారుతున్నయ్ ధారాపాతంగా.

రాజా ఆమెమీద చెయ్యివేసి 'శకూ'! అని పిలిచేడు మెల్లగా.

శకుంతల పలకలేదు. పైగా విసురుగా అతని చేతిని తీసివేసింది.

రాజుకు చివ్వున కోపంవచ్చింది. 'చూడు శకూ. ఆఖరిసారిగా చెప్తున్నాను. నీ మొండితన మింక కట్టిపెట్టు. దేనికైనా ఒక హద్దునేది ఉండాలి. ఏమిటీ అర్థంలేని కోపం నామీద?' అన్నాడు.

ఒక్క ఉదుటున లేచి కూర్చుంది శకుంతల. 'అదే నేనూ అంటున్నాను — దేనికైనా ఒక హద్దునేది ఉండాలని. మీ ప్రవర్తన నాకు ఏమాత్రం నచ్చలేదూ అంటున్నాను. తెలిసిందా?' అంటూ పిచ్చిగా అరచింది శకుంతల.

'నా ప్రవర్తనా? నా ప్రవర్తన కేమయిందని యిప్పుడు?' ముఖాముఖి ఏదోఒకటి తేల్చేసుకోవటానికి నిశ్చయించుకున్నట్టు అడిగేడు రాజా

'ఇప్పుడుకాదు ఎప్పుడూ మీ ప్రవర్తన నాకు బాధను కలిగిస్తూనే ఉంది. మీరు కవులు, రసికులు. మీ చుట్టూ ఉన్న పరిసరాలలో సౌందర్యాన్ని వెతకటం, మీ స్థాయికి సరితూగగల మనుషులతో స్నేహాన్ని కోరటం మీ లక్షణం. అది తప్పోఒప్పో నాకైతే తెలియదు. కాని మీ భార్యగా, నూటికి నూరుపాళ్లు ఆడదానిగా ఈ రకమైన మనస్తత్వాన్ని నేను భరించలేను. మీరు ఎంత గొప్పకవులైనా ఒక ఆడదాన్ని అంగాంగ వర్ణనలుచేస్తూ మీరు ఆనందిస్తుంటే నేను సహించలేను. మీరు ఎంత మేధావులైనా కట్టుకున్న భార్యనుకూడా మర్చిపోయి గంటల తరబడి ఒక పరస్త్రీతో సాహిత్య చర్చలు చేస్తూ కూర్చుంటే నేను చూడలేను. అర్థమయిందా? మీరు వ్రాయటం కాదుగాని మిమ్మల్ని చేసుకున్న రోజునుండి నా మనసుకు శాంతనేది లేకుండా పోయింది. సాధారణ పురుషుల భార్యల్లా నేను నా భర్తను పూర్తిగా వశపరచుకోలేక పోతున్నాను. మిమ్మల్ని నావాడిగా చేసుకోవాలని ప్రయత్నిస్తున్న కొద్దీ మీరు నాకు దూరమవుతున్నారు. అలాటప్పుడు నేను బాధపడటం సమంజసం కాదంటారా? కవి హృదయం సముద్రంలాంటిది. పదిమందీ దూరంగా నిలబడి చూసి ఆనందించటానికి పనికి వస్తుందే తప్ప ఏ ఒక్కరికీ చెందదు ఎవరికీ దాహాన్ని తీర్చదు ఈసంగతి గ్రహించలేక మిమ్మల్ని పెళ్లాడాను. ఇప్పుడు నా పొరపాటుకు ప్రాయశ్చిత్తంగా ఈక్షోభ ననుభవిస్తున్నాను.' అంటూ నెత్తిన చేతులేసుకుని ఏడవసాగింది శకుంతల. తన భార్యను సుఖపెట్టలేక పోవటంలో తన పెద్ద లోపమల్లా తను కవి నవటమేనన్న విషయాన్ని తెలుసుకున్న రాజా ఆ విచిత్రమైన సమస్యకు ఎలాటి పరిష్కారాన్నివ్వాలో తెలియక నిశ్శబ్దంగా బయటకు వెళ్లిపోయేడు.

శకుంతల యింకా ఏడుస్తూనే వుంది. ఆ కవిపత్ని కన్నీటికి అర్థమూలేదు. అంతమూలేదు. ●